

లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు



ర్యాలీలో జగన్, బాలినేని కటౌట్లు



బాలినేనికి గుమ్మడికాయలతో దిష్టితీస్తున్న మహిళలు



నామినేషన్ ర్యాలీలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు, బాలినేని అభిమానులు



ప్రజలకు అభివాదం చేస్తున్న బాలినేని శ్రీకావ్య



ర్యాలీలో గిరిజనుల సంప్రదాయ నృత్యం



అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



బాలినేని సిద్ధం కటౌట్లతో మహిళలు



డ్రోన్‌తో బాలినేని, చెవిరెడ్డి, ప్రణీత్‌రెడ్డిపై పూల వర్షం



ఆకట్టుకుంటున్న కేరళ సంప్రదాయ నృత్యం

జన జాతర..!

ఒంగోలు టౌన్/ఒంగోలు సిటీ: ఎటుచూసినా జనమే జనం.. మనవళ్ల చేతిలో చేయేసి నడుస్తూ అవ్వాతాతలు.. చిన్నారులను భుజాన ఎత్తుకుని పసిబిడ్డల తల్లులు.. జగనన్న జెండాలు ఎగరేస్తూ యువకులు.. మేము సైతం అంటూ యువతులు, మహిళలు, బాలికలు... సోమవారం ఒంగోలు నగరంలో జరిగిన స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. తెలవారుజాము నుంచే వీఐపీ రోడ్డులోని బాలినేని గృహం వద్దకు తరలివచ్చిన ప్రజలతో నగరం జాతరను తలపించింది. సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ పండుగలను కలిపి నిర్వహిస్తున్నట్లు నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు భారీగా కదిలివచ్చారు. వీఐపీ రోడ్డు మొదలుకుని లాయర్‌పేట రోడ్లు, రాజాపానగల్ రోడ్డు, మంగమూరుడొంక, కర్నూలు హైవే, మార్కాపురం రోడ్డు, అద్దంకి బస్టాండు సెంటర్, బాపూజీ మార్కెట్ సెంటర్, పాత కూరగాయల మార్కెట్ సెంటర్, బండ్లమిట్ట సెంటర్, గాంధీ రోడ్డు, ట్రంకు రోడ్డు, పత్తివారిబజారు, కొత్తపట్నం బస్టాండు, నెల్లూరు బస్టాండ్ సెంటర్, సీవీఎన్ రీడింగ్ రూం సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు జనసంద్రాన్ని తలపించాయి. వైఎస్సార్ సీపీ పతాకాలు రెపరెపలాడాయి. వాసన్న పేరు మార్మోగింది. జగనన్న నినాదం హోరెత్తింది. ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ కర్నూలు రోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరిన బాలినేని శ్రీనివాసరెడ్డికి పార్టీ శ్రేణులు, ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఆయన పట్ల వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. బాలినేని కోడలు శ్రీకావ్య మహిళలతో కలిసి సందడి చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



బాలినేని, చెవిరెడ్డి, ప్రణీత్‌రెడ్డిలను గజమాలలతో సన్మానిస్తున్న నాయకులు, అభిమానులు

క్లుప్తంగా

విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు అందించాలి

ఒంగోలు: జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ లైబ్రరీ పుస్తకాలు అందించాలని సమగ్రశిక్ష జిల్లా అదనపు కో ఆర్డినేటర్ డి.సుభద్ర ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇచ్చిన లైబ్రరీ పుస్తకాలను ఇష్యూ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. లైబ్రరీ పుస్తకాల పంపిణీని ఎంఈవో, సీఆర్‌పీలు పర్యవేక్షించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు.

ఎంఈఓ సేవలు అభినందనీయం



ఎంఈఓ వెంకటేశ్వరరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓ-2, ఉపాధ్యాయులు

చీమకుర్తి: చీమకుర్తి ఎంఈఓ–1గా ఎస్.వెంకటేశ్వరరెడ్డి అందించిన సేవలు అభినందనీయమని ఎంఈఓ–2 కే శివాజీ, పలు మండలాల నుంచి హాజరైన ఎంఈఓలు, హైస్కూళ్ల హెచ్‌ఎంలు ప్రశంసించారు. వెంకటేశ్వరరెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వరరెడ్డి దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా హరిహరక్షేత్రం వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రం వార్షికోత్సవాన్ని ఆలయ ప్రాంగణంలో సోమవారం వైభవంగా ప్రారంభించారు. 17 సంవత్సరాలు పూర్తి చేసుకుని 18వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆలయ ట్రస్టీ నిర్వాహకులైన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతుల చేతుల మీదుగా విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకుల సమక్షంలో స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్టీ సభ్యులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

61 మంది వలంటీర్ల రాజీనామా

చీమకుర్తి: వలంటీర్లను టీడీపీ అధినేత చంద్రబాబు అనుచితంగా మాట్లాడి చిన్నచూపు చూసినందుకు నిరసనగా చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 61 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మంచా హరికృష్ణ ఆధ్వర్యంలో రాజీనామాలు చేసి తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్‌కు అందించారు. మంత్రి మేరుగు నాగార్జున గెలుపుతో పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాజీనామా చేసిన వలంటీర్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు.

మంత్రి మేరుగు నామినేషన్



ముందస్తు నామినేషన్ సెట్‌ను రిటర్నింగ్ అధికారికి అందిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


24న మరోసారి భారీ ర్యాలీతో నామినేషన్..

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా మంత్రి మేరుగు నాగార్జున సోమవారం నామినేషన్ పత్రాలను ఆర్వో, జేసీ గోపాలకృష్ణకు అందజేశారు. మరోసారి 24న నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 24వ తేదీ ఉదయం 9 గంటలకు చీమకుర్తిలోని బూచేపల్లి ఇంజినీరింగ్ కాలేజీ వద్ద నుంచి నామినేషన్ వేసే నూతన మున్సిపల్ కార్యాలయం వరకు నిర్వహించే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులకు పిలుపునిచ్చారు.

నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి...

చీమకుర్తి రూరల్ (చీమకుర్తి): ఈ నెల 24వ తేదీ జరిగే మంత్రి మేరుగు నాగార్జున నామినేషన్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, కృష్ణపాటి శేఖర్‌రెడ్డి కోరారు. సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నామినేషన్ ర్యాలీలో ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, నాయకులు దాసరి లక్ష్మీనారాయణ, కూరాకుల రాఘవరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, మక్కెన రాజేంద్ర, పులి వెంకటరెడ్డి, ఏలూరు సురేష్, చిధర్ల శేషు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాసన్న గెలిస్తేనే ఇళ్ల నిర్మాణం



ఓట్లు అభ్యర్థిస్తున్న బాలినేని శచీదేవి

- ఎన్నికల ప్రచారంలో బాలినేని శచీదేవి

ఒంగోలు: వాసన్న గెలిస్తే 9 నెలల్లోనే ఇటీవల అందజేసిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తిచేస్తారని ఆయన సతీమణి బాలినేని శచీదేవి తెలిపారు. ఒంగోలు 24వ డివిజన్‌లో సోమవారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాలినేని శ్రీనివాసరెడ్డిని 6వ సారి గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. వాసన్న రాజకీయాలకు అతీతంగా పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తారన్నారు. ఇళ్ల పట్టాలకు అవసరమైన నిధులను పోరాడి తీసుకొచ్చిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ వాళ్లు కేవలం దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారన్నారు. చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూపిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు ధైర్యంగా ఓటర్ల ముందుకు వస్తున్నారని తెలిపారు. టీడీపీ వాళ్లు మాత్రం ప్రజలను బెదిరించేలా వ్యవహరిస్తున్నారని, అటువంటి వారికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఓటు అడిగే హక్కు ఉంటుందని, ఓటు వేయడం అనేది ప్రజల ఇష్టానికి సంబంధించిన అంశమని అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించాలని, తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, బాలినేనిని చివరిసారిగా గెలిపించి నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేసుకుందామని శచీదేవి కోరారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలంటూ అభ్యర్థించారు. శచీదేవి వెంట స్థానిక కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ హరిబాబు, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు సత్యన్నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ధారావారితోట నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ వేదవతి



విద్యార్థినిని అభినందిస్తున్న నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సౌజన్య



కలువ పూర్ణచంద్ర (584)

ఒంగోలు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పలు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారు. ఒంగోలులోని శ్రీప్రతిభ – శ్రీగురుదత్త విద్యా సంస్థల విద్యార్థి కలువ పూర్ణచంద్ర 584, గడ్డం తేజశ్రీ 576, నూకతోటి యశ్విని 571, బొల్లా తిరుమలరావు 571, యల్లావుల అరవింద రెడ్డి 571, అన్నపునేని రాహుల్ 569, గాలి జగన్‌మోహన్‌రెడ్డి 566, ఉప్పుటూరి అభిలాష్ 566, చేజర్ల దుర్గేశ్వర్ 565, కొండా శ్రీనందిని 565, మద్దసాని శ్రీమణికంఠ 560 మార్కులు సాధించారని చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. 560కిపైగా 11 మంది, 550కిపైగా 15 మంది, 540కిపైగా 20 మంది, 530కిపైగా 25, 520కిపైగా 27, 510కిపైగా 32 మంది, 500కిపైగా మార్కులు 38 మంది సాధించారని అభినందించారు.

నారాయణ విద్యార్థుల జయభేరి...

తమ పాఠశాల విద్యార్థిని కె.తేజ నరసింహ చౌదరి 593 మార్కులు సాధించినట్లు స్థానిక నారాయణ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కొల్లా సౌజన్య తెలిపారు. 123 మంది పరీక్షలు రాశారని, వందశాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా స్థానిక ధారావారితోటలోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో పాటు గణితంలో 10 మంది, తెలుగులో ఐదుగురు, సోషల్ స్టడీస్‌లో ఐదుగురు, సైన్స్‌లో ముగ్గురు వందశాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వేదవతి తెలిపారు.

అక్రమాలు జరిగితే కఠిన చర్యలు

- మద్యం విక్రయాలను తనిఖీ చేసిన జేసీ గోపాలకృష్ణ



మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఆర్‌ఓ, జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి: మద్యం విక్రయాలలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ ఆర్.గోపాలకృష్ణ దుకాణం సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం చీమకుర్తిలోని 8220 నంబర్ మద్యం దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని మద్యం వాస్తవ నిల్వలకు, రిజిష్టర్‌లో ఉన్న వివరాలకు పొంతన లేకపోవడంతో స్థానిక సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి నిల్వలు, విక్రయాలలో తేడాలు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. సెబ్ సిబ్బందికి సమాచారం అందించి పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఘనంగా బాలసంస్కార కేంద్రాల వార్షికోత్సవం

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): కొత్తపట్నం పల్లెపాలెం గ్రామంలో గల శ్రీరామ్ బాలసంస్కార కేంద్రాల ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం దక్షిణ పల్లెపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. దుగరాజపట్నం మెరైన్ సీఐ రేవు కిషోర్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన సేవలందించేందుకు డాక్టర్ చాపల వంశీకృష్ణ, ఆయన సతీమణి శాంతకుమారి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. గ్రామంలోని విద్యార్థులందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో నడపబడుతున్న శ్రీరామ్ బాలసంస్కార కేంద్రాలు ఆదర్శనీయమని అన్నారు. అనంతరం మెరిట్, క్రమశిక్షణ, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు శ్రీరామ్ హాస్పిటల్ డాక్టర్లు, బాలసంస్కార కేంద్రాల సూపర్‌వైజర్ చాపల వినుకొండయ్య, టీచర్లు, గ్రామ కాపులు, పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్‌ఎల్‌బీ పరీక్షల్లో అధికారుల నిర్లక్ష్యం

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నిర్వహిస్తున్న ఎల్‌ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షలో యూనివర్శిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ నెల 20న జరిగిన ప్రొఫెషనల్ ఎథిక్స్ పరీక్షకు ఏ ప్రశ్నపత్రం అయితే ఇచ్చారో.. అదే ప్రశ్నపత్రాన్ని సోమవారం కూడా విద్యార్థులకు అందించారు. ప్రశ్నపత్రం పైభాగంలో మాత్రం సోమవారం నిర్వహించాల్సిన పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్, పారాలీగల్ సర్వీసెస్ అని ఉన్నప్పటికీ.. దిగువ భాగంలో ప్రశ్నలు మాత్రం మొత్తం శనివారం నాటివే ఉన్నాయి. ప్రశ్నపత్రం తయారీలో జరిగిన లోపాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో సోమవారం విద్యార్థులకు ప్రశ్నపత్రం జారీచేసిన తర్వాత విషయం బహిర్గతమైంది. విద్యార్థులు ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకెళ్లడంతో వారు యూనివర్శిటీ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికే గుంటూరులో యూనివర్శిటీ దృష్టికి ఈ విషయం వెళ్లడంతో పాత ప్రశ్నపత్రానికి సంవత్సరం మార్చి హడావిడిగా జెరాక్స్ కాపీలు పంపి పరీక్ష నిర్వహించారు. దీంతో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్ష గంటన్నర ఆలస్యంగా 12 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. ప్రశ్నపత్రం ఒక కాపీ మాత్రమే తయారుచేయడం, నిర్వహణలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.